

పురస్కారం అందుకున్న వీరజవాన్ సతీమణి

ప్రజాశక్తి-నార్పల

సైనిక్ వెల్ఫేర్ ఫ్లాగ్ డే సందర్భంగా శుక్రవారం విజయవాడలోని లోక్ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నార్పలకు చెందిన వీరజవాన్ సుబ్బయ్య సతీమణి గవ్వల లీలావతి గవర్నర్ అబ్దుల్ నజీర్, హోంమంత్రి వంగలపూడి అనితతో పురస్కారం అందుకుంది. సైనిక్ వెల్ఫేర్ ఫ్లాగ్ డే సందర్భంగా దేశం కోసం వీరమరణం పొందిన వీరజవాన్‌ల సతీమణులు, వీరనారీమణులకు పురస్కారాలు అందజేయడం ఆనవాయితీ. ఈ సందర్భంగా వీరజవాన్ సుబ్బయ్య సతీమణి గవ్వల లీలావతి జ్ఞాపిక అందుకున్నారు.



పురస్కారం అందుకుంటున్న లీలావతి

చంద్రన్న బీమా అమలెప్పుడు..?

రేషన్ కార్డు లబ్ధిదారులకు వర్తించని బీమా
కుటుంబ పెద్దను కోల్పోతే పరిహారం శూన్యం
చంద్రన్న బీమాపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం



ప్రజాశక్తి-పెనుకొండ

ప్రమాదాలు.. సహజమరణాల్లో కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయిన పేదలకు అండగా ఉండే బీమా పథకం అమలుపై నీలిమేఘాలు కమ్ముకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదిన్నర అవుతున్నా బీమా పథకం అమలుపై ఎటువంటి ప్రకటనా చేయలేదు. రేషన్ కార్డు ఉన్న కుటుంబ పెద్ద ఆకస్మిక, సహజ మరణం పొందినపుడు ఆ కుటుంబానికి ఆర్థిక ఉపశమనం కలిగించడం కోసం ప్రభుత్వం బీమా పథకం ప్రవేశపెట్టింది. 2014-19 మధ్య అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం చంద్రన్న బీమా పథకం అమలు చేసింది. అనంతరం వైసిపి ప్రభుత్వంలో వైఎస్సార్ బీమా అనే పేరుతో ఈ పథకం అమలు చేసింది.

కుటుంబ పెద్ద సహజంగా మరణిస్తే రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తూ చనిపోతే రూ.5 లక్షలు, శాశ్వత వికలాంగులుగా మారితే రూ.5 లక్షలు, 70 ఏళ్ల వ్యక్తి ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.3లక్షలు అందించే విధంగా పథకం రూపకల్పన చేసింది. జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ (డిఆర్‌డిఎ) ఆధ్వర్యంలో బీమా పథకం అమలు చేసేవారు. ఇందుకోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూంతోపాటు 24 గంటలూ పనిచేసే విధంగా అధికారులను కేటాయించారు. ఫోన్ ద్వారా సమాచారం అందిన వెంటనే వివరాలు నమోదు చేసుకుని, దగ్గరలోని ఏపీఎంలకు, యానిమేటర్లకు విషయం తెలిపి సకాలంలో బీమా మొత్తాన్ని బాధిత కుటుంబానికి అందజేసేలా చర్యలు తీసుకునేవారు.

చంద్రన్న బీమా అమలెప్పుడు..?

కూటిమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రన్న బీమా పథకం అమలు చేస్తామని 'ప్రజాగళం - ఉమ్మడి మేనిఫెస్టో'లో ఆ పార్టీల నాయకులు హామీచ్చారు. గతం కన్నా మిన్నగా ఆర్థికప్రయోజనం చేకూరుస్తామని గొప్పలు చెప్పారు. సహజ మరణానికి రూ.5లక్షలు, ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తామని ప్రకటనలు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదిన్నర పూర్తవుతున్నా ఇంతవరకూ చంద్రన్న బీమా పథకం గురించి పార్టీ నాయకులెవరూ మాట్లాడని పరిస్థితి నెలకొంది. పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి. ఇలాంటి వారికి బీమా అమలు చేసి ఉంటే కాసింత ఉపశమనం కలిగేదని బాధిత కుటుంబాలు పేర్కొంటున్నాయి. గత ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ బీమా పథకం అమలకు నోచుకోలేదు. అప్పట్లో ప్రమాదవశాత్తు, సహజ మరణం చెందిన వారికి ఎలాంటి బీమా అందించలేదు. అడపాదడపా నూటికి ఒకరికో ఇద్దరికి బీమా సొమ్మును అందించి చేతులు దులుపుకున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

రేషన్ కార్డు లబ్ధిదారులకు వర్తించని బీమా..

ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని గాలి కొదిలేసింది. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న బీమా పథకం అమలులో తాత్సారం చేస్తోంది. జిల్లాలో రేషన్ కార్డులు ఉన్న కుటుంబాలు 563028 లక్షలు ఉన్నాయి. రెవెన్యూ డివిజన్ల వారీగా చూస్తే పెనుకొండ 2,298,840, ధర్మవరం-1,33,372, పుట్టపర్తి-96,615, కదిరి-109,101 కలిపి మొత్తం 5,63,028 రేషన్‌కార్డులు ఉన్నాయి. గతేడాది (2024-25)లో వివిధ ప్రమాదాల్లో 489 మంది చనిపోయారు. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఇప్పటి వరకు 375 మంది మరణించారు. ఏటా 900 నుంచి 1100 సహజ మరణాలు నమోదవుతున్నాయి. వందలాది మంది ప్రమాదాల కారణంగా వైకల్యం బారినపడి మంచానపడ్డారు. బీమా పథకం లేకపోవడంతో ఆయా బాధిత కుటుంబాలు రోడ్డునపడ్డాయి. బీమా విషయంపై ప్రభుత్వం తనకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండటంపై పేదలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ పోషణ, పిల్లల చదువులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ప్రభుత్వం స్పందించి బీమా పథకాన్ని అమలు చేయాలని కోరుతున్నారు.

బీమా పథకం అమలుచేయాలి

కూటమి నాయకులు ఎన్నికల హామీలో భాగమైన చంద్రన్న బీమా పథకం తక్షణమే అమలు చేయాలి. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ పథకం ఎంతో ఉపయోగకరం. ప్రమాదాలు సహజ మరణాల్లో కుటుంబాన్ని పోషించే పెద్ద మరణిస్తే ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతుంది. బీమా సొమ్ము ఆ కుటుంబానికి భరోసా ఇస్తుంది. కూటమి ప్రభుత్వ నాయకులు బీమా పథకం అమలు చేసేందుకు చొరవ చూపాలి.



బాబావలి,
సిఐటియు నాయకులు



నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ. నల్లప్ప, తదితరులు

ఉపాధి చట్టం సవరణ అన్యాయం : సిపిఎం

ప్రజాశక్తి - బుక్కరాయసముద్రం

కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ చట్ట సవరణ చేయడం అన్యాయమని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ. నల్లప్ప విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ తీసుకొచ్చిన బిల్లుకు వ్యతిరేకంగా బుక్కరాయసముద్రం మండల మండల కేంద్రంలో మహాత్మ గాంధీ విగ్రహం దగ్గర శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ హక్కుగా ఉన్న ఉపాధి చట్టాన్ని ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడే పథకంగా కేంద్ర ప్రభుత్వం మార్చుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఉపాధిహామీ చట్టం అమలుకు ఇప్పటిదాకా కేంద్రం 90శాతం, రాష్ట్రం 10శాతం ఖర్చు చేస్తున్నాయన్నారు. దానిని మార్పు చేస్తూ కేంద్రం 60శాతం మాత్రమే కేటాయించి మిగిలింది రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని చెబుతోందన్నారు. ఇది నష్టదాయకమన్నారు. రాష్ట్రంలో 7వేల కోట్ల రూపాయల ఖర్చులో రాష్ట్రం రూ.2,800 కోట్లు భరించాల్సి వస్తుంది. దీంతో రాష్ట్రాలపై భారం పడుతుందన్నారు. ఉపాధిహామీ పథకానికి కేంద్రం నిధుల్లో కోత విధించేకుట్ర పన్నారన్నారు. ఇతర ఏ పనులు లేనప్పుడు ఏడాదిలో 100 రోజుల పని ఎప్పుడైనా పొందే పనిహక్కు 2005 చట్టంలో ఉందన్నారు. ఇప్పుడు దానిని మార్చి ప్రభుత్వం నోటిఫై చేసిన ప్రాంతాల్లో 100 రోజులు పని చేయడానికి వీలు లేదని చట్టాన్ని మార్చారని విమర్శించారు. 100 రోజుల నుండి 125 రోజులకు పెంచినట్లు ప్రభుత్వం చెబుతున్నా దీనికి తగ్గ నిధులు పెంచడానికి గ్యారెంటీ లేదన్నారు.. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టంగా ఉన్న ఈ పథకం పేరును జిరాంజీ అనే పేరు వచ్చేలా మార్చి, మతం రంగు పులిమే ప్రయత్నం చేశారని విమర్శించారు. పనిచేసే చోట్ల ప్రమాదాలు జరిగినా, కనీస సౌకర్యాలు లేకున్నా, వేతనాలు ఆలస్యం అయినా రాష్ట్ర ప్రభుత్వాలదే బాధ్యత అని కేంద్ర ప్రభుత్వం తప్పుకుంటోందన్నారు. ఇది అన్యాయమన్నారు. ఉపాధి చట్టాన్ని యథాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు సి నాగేంద్ర, రాముడు, సుంకయ్య, వెంకటేష్, రాము, శ్రీకాంత్, శ్రీరాములు, అంజి, రాజు, అశోక్, రాజు, ముణి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కుల విద్యార్థి సంఘాల ముసుగులో దందాపై ఫిర్యాదు

ప్రజాశక్తి - అనంతపురం

కులవిద్యార్థిసంఘాల ముసుగులో దందాలకు పాల్పడుతున్నారని జిల్లా ప్రయివేటు పాఠశాలల సంఘం నాయకులు డిఇఒకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగులమైన తాము మరి కొంతమంది నిరుద్యోగులకు ఉపాధి చూపుతూ ఎన్నో ప్రయాసలకోర్చి పాఠశాలలు నడుతున్నామన్నారు. అయితే ప్రతి సంవత్సరము కొన్ని కొంతమంది అరాచక వాదులు విద్యార్థి సంఘాల ముసుగులో ప్రైవేటు పాఠశాలల్లోకి ప్రవేశించి తమకు చందాలు ఇవ్వాలని బెదిరిస్తున్నారన్నారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని కోరారు. వీరి దందాపై కలెక్టర్‌కు, ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా ప్రైవేట్ పాఠశాల సంఘం గౌరవాధ్యక్షులు గంగాధర్, జిల్లా అధ్యక్షులు గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యక్షులు రాఘవేంద్ర, గౌరవ సలహాదారులు రామాంజనేయులు, నగర అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, నగర ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, గౌరవ సభ్యులు శ్రీవత్సవ, నరేంద్ర కుమార్, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ప్రజాశక్తి-రాయదుర్గం

ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికీ పోలియో చుక్కలు వేసి పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని విప్ కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఈమేరకు శుక్రవారం తన నివాసంలో వైద్యులతో కలిసి ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బిడ్డకూ పోలియో చుక్కలు వేసేలా కృషి చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. నియోజకవర్గం పరిధిలోని 28వేల మంది ఐదేళ్లలో పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్లు వైద్యులు వివరించారు. ఈనెల 22, 23వ తేదీల్లో 40 వేల ఇళ్లకు వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ రమేష్, అజహర్, యశ్వంత్‌రాజ్, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, సిడిపిఒ ఆవుల పద్మావతి, జల వనరుల శాఖ డిఇఇ గీతాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'పది'లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

గుత్తి : మండలంలో పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని ఎంపిడిఒ డి.ప్రభాకరనాయక్ సూచించారు. శుక్రవారం మండలంలోని ఇసురాళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సలహాలు, సూచనలు అందించారు. వంద రోజుల కార్యక్రమంలో భాగంగా రోజూ పాఠశాలలో అదనపు తరగతులు నిర్వహించి విద్యార్థులకు పాఠాలు సులువుగా అర్థమయ్యేలా బోధించాలన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన

యల్లనూరు : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను జిల్లా సివిల్ జడ్జి రాజశేఖర్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మానవ హక్కులు, బాల్య వివాహాలు, విద్యా విధానం, క్రమశిక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు రామాంజనేయులు, అడ్వకేట్ మహబూబ్, విద్యాశాఖ అధికారి పరమేశ్వరరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలిస్తున్న జిల్లా సివిల్ జడ్జి రాజశేఖర్

డాక్టర్ రామసుబ్బయ్య అంత్యక్రియలు

ప్రజాశక్తి అనంతపురం

ప్రముఖ వైద్యులు డాక్టర్ రామసుబ్బయ్య అంత్యక్రియలు శుక్రవారం ముగిశాయి. రామసుబ్బయ్య భౌతికకాయాన్నిస్వగృహం రాంనగర్ నుండి ర్యాలీగా గుత్తి రోడ్డులోని హరిశ్చంద్ర ఘాట్‌కు చేర్చి అక్కడ ఆయన కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు ఆయన భౌతికకాయాన్నిలువురు ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు, బంధువులు మిత్రులు అంత్యక్రియల కార్యక్రమంలో పాల్గొన్నారు.



హరిశ్చంద్ర ఘాట్‌లో డాక్టర్ రామసుబ్బయ్య అంత్యక్రియలు



నేత్రాలను అందజేస్తున్న కిరణ్‌కుమార్ తల్లిదండ్రులు

జెవివి రాష్ట్ర కన్వీనర్ కుమారుడి నేత్రదానం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

విశ్రాంత ఉపాధ్యాయులు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్ కుమారుడు సాకే కిరణ్‌కుమార్ (21) అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. తన కుమారుడి మరణం ఎంతో బాధ కలిగించినప్పటికీ తమబిడ్డని సజీవంగా చూడాలనే ఉద్దేశంతో నేత్రాలను రెడ్‌క్రాస్ సొసైటీకి దానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులతో పాటు చనిపోయిన కిరణ్‌కుమార్ తల్లి అరుణకుమారి, జెవివి నాయకులు సాకే తిరుపాల్, అరవీటి ప్రసాద్ పాల్గొన్నారు.

అనంతపురం జిల్లా పోలీసుశాఖకు ఎబిసిడి అవార్డు



డిజిపి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఎస్పీ జగదీష్

ప్రజాశక్తి - అనంతపురం

అనంతపురం పోలీసుశాఖకు రాష్ట్రస్థాయి ఎబిసిడి(అవార్డ్ ఫర్ బెస్ట్ క్రైమ్ డిటెక్షన్) అవార్డు వరించింది. శుక్రవారం మంగళగిరి పోలీసు ప్రధాన కార్యాలయంలో ఈ అవార్డును అనంతపురం రేంజ్ డిఐజి షిమూషి సమక్షంలో డిజిపి హరీష్ కుమార్ గుప్తా చేతుల మీదుగా అనంతపురం ఎస్పీ జగదీష్ అందుకున్నారు. ఎస్పీ పి.జగదీష్ సారథ్యంలో రాయదుర్గం యు.పి.ఎస్ , రాయదుర్గం రూరల్, జిల్లా సైబర్ విభాగం పోలీసులు ఈ అవార్డ్ అందుకున్నారు. కాంబోడియా దేశం నుండి ఫేక్ యాప్‌లు ఆపరేట్ చేస్తూ డిల్లీ కేంద్రంగా ఫ్రాడ్ డబ్బును భారీగా ఫేక్ అకౌంట్లలోకి బదలాయించిన గుట్టు రట్టును చేసిన రాయదుర్గం యుపిఎస్ , రాయదుర్గం రూరల్, జిల్లా సైబర్ విభాగం పోలీసులను అధికారులు ఈసందర్భంగా ప్రశంసించారు. రాయదుర్గం

డిజిపి చేతులమీదుగా అవార్డు అందుకున్న ఎస్పీ

మండలం వేపరాళ్లకు చెందిన సాఫ్ట్ వేర్ ఇంజనీర్ నరసింహప్ప 18-06-25న ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ పర్యవేక్షణలో కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు ఆధ్వర్యంలో సిలు జయనాయక్, వెంకటరమణ, షేక్ జాకీర్ , ఎస్సైలు నాగమధు, గుర్నాథరెడ్డిల సారథ్యంలో పోలీసు బృందాలు దర్యాప్తు చేపట్టాయి. 01-08-2025 తేదీన ఐదుగురు సభ్యులు గల ముఠాను అరెస్టు చేసి...రూ. 41.20 లక్షల నగదు, 8 సెల్ ఫోన్లు, కారు, 20 ఏటిఎం కార్డులు, 15 సిమ్ కార్డులు, 5 బ్యాంక్ పాస్ బుక్కులు, 10 చెక్కు బుక్కులు, 2 రూటర్స్ స్వాధీనం చేసుకున్నారు. దేశ వ్యాప్తంగా క్రియేట్ చేసిన 13 ఫేక్ అకౌంట్లలోకి సదరు డబ్బు వెళ్లినట్లు దర్యాప్తులో వెల్లడయ్యింది. డిల్లీ కేంద్రంగా ఫేక్ అకౌంట్ల ద్వారా పలు అకౌంట్లలోకి ఫ్రాడ్ చేసిన డబ్బు మార్పిడి చేశారు. క్రిప్టో కరెన్సీ ద్వారా దేశం దాటించేందుకు సిద్ధమైన సమయంలో పోలీసులు గుట్టురట్టు చేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇలాంటి కేసులను పరిష్కరించినప్పుడే ప్రజల్లో పోలీసుశాఖపై గౌరవం పెంపొందుతుందన్నారు. ఈ అవార్డును స్ఫూర్తిగా తీసుకుని మరిన్ని కేసులను సమర్థవంతంగా, సమిష్టిగా ఛేదిస్తామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా కీలక కేసుల దర్యాప్తుల్లో అత్యంత ప్రతిభ కనపరచడాన్ని గుర్తించి ప్రతిష్టాత్మకంగా ప్రతీ మూన్నెళ్లకు ఒకసారి ప్రకటించే ఏబిసిడి (అవార్డు ఫర్ బెస్ట్ క్రైం డిటెక్షన్) అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని ఎస్పీ అన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

హెల్మెట్ వాడకంపై కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో పోలీసులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఎఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి మాట్లాడుతూ హెల్మెట్ అంటే ఫ్యాషన్ వస్తువు కాదని, ప్రాణాలను కాపాడే రక్షణ కవచం అన్నారు. అందుకే ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే ప్రమాదాల సమయంలో ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐ రామసుబ్బయ్య, ఎస్ఐ ఆంజనేయులు, పోలీసులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న ఎఎస్పీ



నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులపై పోలీసులు జులుం ప్రదర్శించడాన్ని నిరసిస్తూ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం అనంతపురంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి-డి.హీరేహాల్

మండలంలోని ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే ప్రభుత్వ ప్రథమ లక్ష్యమని విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కాలవ శ్రీనివాసులు నేరుగా ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా సుమారు 300 పైచిలుకు ఫిర్యాదులు అందాయి. అనంతరం ఫిర్యాదుదారులతో మాట్లాడుతూ ప్రాధాన్యత వారీగా సమస్యలను పరిష్కరించడంతోపాటు అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ హనుమంతురెడ్డి, మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగల్లి రాజు, తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఒ దాసానాయక్, తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యేలు

గుంతకల్లు : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకే కూటమి ప్రభుత్వం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తోందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 9వ సచివాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 8, 9వ వార్డులకు చెందిన ప్రజలు తమ అర్జీలను ఎమ్మెల్యేకు అందజేశారు. ఇందులో 114 అర్జీలు రాగా కేవలం ఇళ్లస్థలాల కోసమే 94 మంది ప్రజలు అభ్యర్థించారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరు ఇంతియాజ్‌అలీ, టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసులు, డిఇ షబానా, టిడిపి మండల ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణస్వామి, నాయకులు ముక్కన్నగారి గుణశేఖర్, డాక్టర్ హిమబిందు, చికెన్ జగన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

'ఉపాధి' నిర్వీర్యం తగదు

సిపిఎం, వ్యకాసం ఆధ్వర్యంలో కొనసాగిన నిరసనలు

ప్రజాశక్తి-తాడిపత్రి

కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టం స్ఫూర్తిని దెబ్బతీస్తూ చేస్తున్న మార్పులు చేయడాన్ని నిరసిస్తూ తాడిపత్రిలోని గాంధీ విగ్రహం ముందు సిపిఎం ఆధ్వర్యంలో నాయకులు నోటికి నల్లరిబ్బను కట్టుకొని మార్పు ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు జగన్మోహన్‌రెడ్డి, రాజారామిరెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని హక్కుగా ఎత్తివేసే ప్రభుత్వ దయా దాక్షిణ్యాలపై ఆధారపడే చట్టంగా మార్చారన్నారు. ఈ విధానం వల్ల పని ఉంటే ఉపాధి పథకం వర్తిస్తుంది.. లేకుంటే లేదన్నారు. ప్రస్తుతం ఉపాధి హామీ చట్టం అమలుకు కేంద్రం 90 శాతం, రాష్ట్రం 10శాతం ఖర్చు చేస్తున్నాయన్నారు. దీన్ని మార్పు చేస్తూ కేంద్రం 60శాతం మాత్రమే కేటాయిస్తుంది. మిగిలిన నిధులు రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలన్నారు. ఈ విధానం చాలా నష్టదాయకమన్నారు. కావున కేంద్ర ప్రభుత్వం స్పందించి ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు హనుమంతురెడ్డి, నాగరాజు భాస్కర్, చంటి, రమణ, అంజి, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : గ్రామాల్లో నిరుపేదల హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో ప్రవేశపెట్టిన 2025 ఉపాధి హామీ బిల్లును ఉపసంహరించుకోవాలని సిపిఎం, అనుబంధ సంస్థ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ఉపాధి హామీ బిల్లుకు వ్యతిరేకంగా నాయకులు ధర్నా చేశారు. అనంతరం డిప్యూటీ ఎంపిడిఒ నరసింహారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎం.మల్లేష్, సిపిఎం నాయకులు ఎన్.రేణుక, యం.మల్లికార్జున, సి.రమేష్, అశోక్, చంద, వన్నూరమ్మ, జయమ్మ, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి నవీన్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు విమర్శించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీన పరిచే సవరణ బిల్లుకు వ్యతిరేకంగా శుక్రవారం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2005లో తెచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి వికసిత్ భారత్ గ్రామీణ్ రోజ్‌గార్ అజీవిక్ మిషన్ పేరుతో పథకంగా మార్చేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. మహాత్మా గాంధీ పేరును పూర్తిగా తొలగించి పూజ్య బాపూగా మార్చడం గాంధీజీని అవమానించడమే అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని బలహీన పరిచే సవరణ బిల్లును ఉపసంహరించాలని, ప్రతి కుటుంబానికీ కనీసం 200 రోజులు పని హామీ కల్పించాలని, కూలీలకు తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఉపాధి పనులకు తగిన నిధులు కేటాయించాలని, పనుల మంజూరు వేతన చెల్లింపులో ఉన్న ఆలస్యాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఎస్.సూరి, మండల నాయకులు నాగభూషణం, పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేయడం తగదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.కేశవరెడ్డి అన్నారు. ఉపాధి హామీ చట్టంలో మార్పులు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ చట్టంపై తీవ్రమైన దాడి మొదలైందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఉపాధి హామీ చట్టాన్ని రక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పెద్ద పెదయ్య, జిల్లా ఉపాధ్యక్షులు పెరుగు సంగప్ప, సిపిఐ మండల కార్యదర్శి సాకే గంగాధర్, సహాయ కార్యదర్శులు చాపల రామాంజనేయులు, సాకే సుధాకర్, వ్యకాసం నాయకులు వడ్ల సూర్యనారాయణ, నాయకులు నాగరాజు, రాగే నారాయణప్ప, తదితరులు పాల్గొన్నారు.



తాడిపత్రిలో నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

22న డప్పు కళాకారుల సంఘం మహాసభ

ప్రజాశక్తి-పుట్లూరు

బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో ఈనెల 22న నిర్వహించనున్న డప్పు కళాకారుల సంఘం మహాసభను జయప్రదం చేయాలని కెవిపిఎస్ మండల కార్యదర్శి కె.నాగభూషణం పిలుపునిచ్చారు. ఈమేరకు శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి డప్పు కళాకారుడి కుటుంబానికీ రెండెకరాల భూమి ఇవ్వాలని, అర్హులకు పింఛన్ ఇవ్వాలని, పెన్షన్ అర్హత వయస్సు 50 నుంచి 45ఏళ్లకు తగ్గించాలని, పెన్షన్ రూ.4వేల నుంచి రూ.7వేలకు పెంచాలని, డప్పు, డ్రస్సు, గజ్జలు ఉచితంగా ఇవ్వాలని, ఉచిత ప్రమాద, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలపై మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కమిటీ నాయకులు యేసురత్నం, ఓబులేసు, ఓబులయ్య, ఓబయ్య, పుల్లయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సూరి, టి.పెద్దయ్య, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

యల్లనూరు : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కరుణసాగర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు అందరూ హాజరు కావాలని కోరారు.

పివికెకెలో ప్రీ క్రిస్మస్ వేడుకలు

అనంతపురం : పివికెకె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో శుక్రవారం ప్రీ-క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హాల్‌ను రంగురంగుల దీపాలు, క్రిస్మస్ ట్రీతో పాటు విద్యార్థులు తయారు చేసిన స్నోమ్యాన్ ఆకృతితో అందంగా ముస్తాబు చేశారు. ఈ కార్యక్రమానికి కల్వరీ గ్రేస్ చర్చ్‌కు చెందిన రెవ పాల్ ఆరన్ ముఖ్య అతిథిగా హాజరై క్రిస్మస్ సందేశాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ పల్లె కిశోర్, మేనేజ్‌మెంట్ ప్రతినిధి కె.శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బి.రమేష్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ పి.దీప్తిజోర్డానా, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె.మనోహర్‌రెడ్డి, స్టూడెంట్ యాక్టివిటీ సెల్ కన్వీనర్ డి.ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్

అనంతపురం : ఇంధన పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా ఈనెల 20, 21వ తేదీల్లో తిరుపతిలో సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నట్లు ఎపిఎస్‌పిడిసిఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి పాత తిరుచానూరు రోడ్డులోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విజేతలకు ఈనెల 21న బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవం

రాయదుర్గం : రాయదుర్గం ఆర్టీసీ డిపోలో శనివారం నుంచి కార్గో డోర్ డెలివరీ మాసోత్సవం నిర్వహించనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ జె.శ్రీనివాస్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు ఆర్టీసీ ప్రవేశపెట్టిన డోర్ డెలివరీ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పశువుల దాణా పంపిణీ

బొమ్మనహాల్ : మండల పరిధిలోని శ్రీధర్‌ఘట్ట గ్రామంలో పశువుల రైతులకు శుక్రవారం దాణా పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పశువైద్యాధికారి మన్మోహన్‌రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ బలరామ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తకు పరామర్శ

శింగనమల : మండల పరిధిలోని గురుగుంట్ల గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త బండి దైవయత్నంను మార్కెట్ యార్డు ఛైర్మన్ దండు శ్రీనివాసులు శుక్రవారం పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో దైవయత్నం గాయపడి అనంతపురంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. పరామర్శించిన వారిలో టిడిపి సీనియర్ నాయకులు దాసరి గంగాధర్, సత్యనారాయణ, బండి పరశురాం, అనిల్, చంద్రాయుడు, గురుగుంట్ల లింగమయ్య, చలమయ్య, ప్రకాష్, నారాయణ స్వామి, శివయ్య, నాగభూషణ, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

పుట్లూరు : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి ఎల్.రాజశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం బాల్య వివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాల్య వివాహాలకు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా బాల్య వివాహాలు చేస్తుంటే ధైర్యంగా 1098కు కాల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఆర్.రామాంజనేయరెడ్డి, న్యాయవాది మహబూబ్‌బాషా, ఎంఇఒ ప్రేమ్‌కుమార్, ఎస్ఒ మాధవి, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కళ్యాణదుర్గం టౌన్ : కంబదూరు మండలం నూతిమడుగు 33 కెవి ఫీడర్‌కు సంబంధించిన బ్రేకర్లు మార్చుతున్న నేపథ్యంలో శనివారం కొన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజశేకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత 220 కెవి పరిధిలోని భట్టువానిపల్లి, నూతిమడుగు, అచ్చంపల్లి సబ్‌స్టేషన్‌లలో విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఎటిఎం కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వినతి

పెద్దపప్పూరు : మండల కేంద్రంలో ఎటిఎం కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలోని అనంత గ్రామీణ బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎంఆర్‌పిఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఆదినారాయణ మాదిగ, సిపిఐ మండల కార్యదర్శి చింతా పురుషోత్తం, ఎంఎస్‌పి యాడికి మండల అధ్యక్షులు లింగాల చిన్న గుర్రప్ప మాదిగ, నాయకులు కంబగిరి స్వామి, సూర్యనారాయణ, రామాంజనేయులు, గుర్రప్ప, గోపాల్, ప్రసాద్, రంగడు, నారాయణ, రామస్వామి, తదితరులు ఉన్నారు.

క్రీడల్లో ఎర్రగుంట విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కుందుర్పి

కళ్యాణదుర్గం జోనల్ లెవెల్ ఆర్డీటీ జోడు ఛాంపియన్స్ పోటీలో ఎర్రగుంట జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఓవరాల్ గర్ల్స్ ఛాంపియన్స్ సాధించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఓబులేసు మాట్లాడుతూ బెలుగుప్ప మండలం అంకంపల్లి గ్రామంలో నిర్వహించిన పోటీల్లో ఎర్రగుంట జిల్లా పరిషత్ హైస్కూల్ బాలికలు 8 బంగారు, 1 సిల్వర్ పతకాలు సాధించినట్లు తెలిపారు. అలాగే బాలురు రెండు బంగారు, రెండు సిల్వర్, ఒక బ్యాచ్ పతకాలు సాధించినట్లు తెలిపారు. పతకాలు సాధించడం పాఠశాలకు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో పిఇటి శ్రీనివాసులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు శిక్షణ

నార్పల : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో గ్రామ పంచాయతీలకు సొంత ఆదాయ వనరులు (ఓఎస్ఆర్) అనే అంశంపై శనివారం ఒక్కరోజు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపిడిఒ మమతాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, డిజిటల్ సహాయకులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

22న నిరసన

ఆత్మకూరు : ఉపాధి హామీ చట్టంలో మార్పు చేయడాన్ని నిరసిస్తూ ఈనెల 22వతేదీన మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలపనున్నట్లు సిపిఐ నాయకులు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకే కేంద్ర ప్రభుత్వం మార్పులు తీసుకొచ్చిందన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. నిరసన కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజవర్గ కార్యదర్శి ఎం.రమేష్, నాయకులు నీళ్లపాల రామకృష్ణ, బండారు శివ, గోపాల్‌నాయక్, సరస్వతి, నల్లమ్మ, లక్ష్మి, లలితమ్మ, లక్ష్మీదేవి, గోవిందు, హనుమన్న, కృష్ణమూర్తి, నాగరాజునాయక్, తులసీనాయక్, తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాపకశక్తితో మెరుగైన ఫలితాలు

అనంతపురం : విద్యార్థులు అనవసరమైన ఆలోచనలు చేయకుండా చదువుపై జ్ఞాపకశక్తి పెంచుకుంటే మెరుగైన ఫలితాలు సాధిస్తారని నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం ఛైర్‌పర్సన్ ఎస్. నిర్మలమురళి సూచించారు. శుక్రవారం అనంతపురంలోని ఆదిమూర్తినగర్‌లో ఉన్న గిల్డ్ ఆఫ్ సర్వీస్ పాఠశాల సమీపంలో ఉన్న ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహంలో చదువుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించాలంటే నిత్యం పుస్తక పఠనం చేయడంతోపాటు అర్థం చేసుకోవాలన్నారు. మనకు సహాయం చేసిన గురువులు, జన్మనిచ్చిన తల్లిదండ్రులను, మంచి మిత్రులను ఎప్పటికీ మర్చిపోకూడదన్నారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారిణి వై.మాధవీలత, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలి

ప్రజాశక్తి-అనంతపురం

ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఇబి దేవి సూచించారు. శుక్రవారం జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బందికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈనెల 21న నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమంపై సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ ప్రస్తుతం పోలియో కేసులు మన దేశంలో లేనప్పటికీ కొన్ని దేశాల్లో ఉండటం వల్ల ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున ఐదేళ్లలోపు చిన్నారులందరికీ చుక్కలు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి, డాక్టర్ జయలక్ష్మి, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ విష్ణుమూర్తి పాల్గొన్నారు.

శింగనమల : ఈనెల 21వతేదీ చేపట్టనున్న పల్స్‌పోలియో చుక్కల కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను మండల పరిధిలోని తరిమెల పిహెచ్‌సిలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి శంకర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దాసుపత్రి, వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎంపి అంబికా లక్ష్మీనారాయణ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని పెద్దాసుపత్రితోపాటు వాసవీ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ముందుగా కేక్ కోసి పంచిపెట్టారు. తర్వాత నగరంలోని ఆర్ కన్వెన్షన్ హాలులో కార్యకర్తల సమక్షంలో కేక్ కోసం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

పలువురి శుభాకాంక్షలు

శింగనమల : అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ పుట్టిన రోజును పురస్కరించుకుని శింగనమల మార్కెట్ యార్డు ఛైర్మన్ దండు శ్రీనివాసులు, మండల కార్యదర్శి మారుతీనాయులు వేర్వేరుగా శుక్రవారం అనంతపురంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పూలహారాలు, పూల మొక్కలు అందజేశారు. ఎంపిని కలిసిన వారిలో టిడిపి నాయకులు గంగాధర్, సత్యనారాయణ, బండి పరశురామ్, చల్లా నాగరాజు, చలమయ్య, చిన్న ఆంజినేయులు, అనిల్, చంద్రాయుడు, గురుగుంట్ల లింగమయ్య, ప్రకాష్, గురుగుంట్ల నారాయణస్వామి, గురుగుంట్ల శివయ్య, గురుగుంట్ల నాగభూషణ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సిసి విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి-రాయదుర్గం

త్వరలో కేరళ రాష్ట్రంలో నిర్వహించనున్న అఖిల భారత పర్వతారోహణ పోటీలకు ఎంపికైన స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు ఎన్సిసి క్యాడెట్లను కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాసులు శుక్రవారం అభినందించారు. కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న వృక్షశాస్త్ర విభాగానికి చెందిన శివప్రసాద్, ఆర్థికశాస్త్ర విభాగానికి చెందిన శివరాజు, తెలుగు విభాగానికి చెందిన నాయకుల సింహాద్రి పోటీల్లో పాల్గొననున్నారు.

ఉద్యోగుల ఔదార్యం

రూ.40వేలతో విద్యార్థులకు షెడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-శెట్టూరు



విద్యార్థులకు కట్టించిన షెడ్డులో దాతలు

విద్యార్థుల సౌకర్యార్థం రూ.40వేలతో రేకులషెడ్డు నిర్మించి ఓ బ్యాంకు ఉద్యోగి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. మండలం పరిధిలోని కొత్తూరు గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తరగతి గదుల కొరత ఉండటంతో విద్యార్థులు ఆరుబయట చెట్ల కింద కూర్చొని చదుకునేవారు. విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు డేగావత్ రవీంద్రనాథ్ తన మిత్రుడు, బ్యాంకు ఉద్యోగి లోకేష్‌కు సమాచారం అందించారు. ఇందుకు స్పందించిన లోకేష్ తన మిత్రులు ఒంటిమిద్ది నాగరాజు, గరుడాపురం విజయ్ సహకారంతో రూ.40వేలు వెచ్చించి రేకుల షెడ్డును నిర్మించారు. దీంతో విద్యార్థులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగరాజు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు డేగావత్ రవీంద్రనాథ్, పాఠశాల కమిటీ ఛైర్మన్ గోవిందప్ప, ఉపాధ్యాయలు అలివేలుమంగ, మల్లారెడ్డి, రామాంజనేయులు, కృష్ణ, శివాసినీ బాయి, లోకేష్ మిత్రులు ఒంటిమిద్దె నాగరాజ్, గరుడాపురం విజయ్, టీచర్ మంజునాథ్ యాదవ్, చైతన్య, శ్రీనాథ్‌చౌదరి, ఉమారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రామసుబ్బయ్య సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజారోగ్య వేదిక సభ్యులు డాక్టర్ ప్రసూన

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో పరిచయం అవసరం లేని డాక్టర్ రామసుబ్బయ్య సేవలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ప్రజారోగ్య వేదిక సభ్యులు డాక్టర్ ప్రసూన శుక్రవారం ఒక ప్రకటనలో కొనియాడారు. ఆయన జీవితంలోని అనేక దశలు తెలుసుకోవడం మనకు ఆసక్తిదాయకంగా ఉంటాయన్నారు. ఆయన కర్నూలు జిల్లాలో పుట్టినా అనంతపురం జిల్లానే తన సొంత జిల్లాగా చేసుకున్నారన్నారు. 48 ఏళ్లుగా జిల్లా ప్రజలకు వైద్యుడిగా, సామాజిక చైతన్యశీలిగా, అడ్మినిస్ట్రేటర్‌గా, సంస్థల నిర్మాతగా తనసేవలను అందిస్తూనే ఉన్నారన్నారు. ముఖ్యంగా డాక్టర్ రామసుబ్బయ్య అనగానే చిరకాలం గుర్తుండిపోయే విషయాలు పెద్దాసుపత్రి, మెడికల్ కాలేజీ, రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు అన్నారు. ఆయన శ్రమ, పట్టుదల, గుర్తింపునకు గుర్తులుగా నిలిచిపోతాయన్నారు.

నెల్లూరు మున్సిపల్ కార్మికులపై పోలీసుల జులుం తగదు

సిఐటియు ఆధ్వర్యంలో నిరసనలు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులపై పోలీసులు జులుం ప్రదర్శించడాన్ని నిరసిస్తూ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, మున్సిపల్ యూనియన్ నగర కార్యదర్శి తిరుమలేశు మాట్లాడుతూ నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కార్మికులు గురువారం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తుంటే సమస్యలు పరిష్కరించకపోగా కూటమి ప్రభుత్వం కార్మికులపై ఉక్కుపాదం మోపడం సిగ్గుచేటు అన్నారు. పోలీసులు దాడి చేయడంతో 10 మందిపైగా కార్మికులు గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. 63 మంది కార్మికులను అక్రమ అరెస్టులు చేయించారన్నారు. మహిళలు అని కూడా చూడకుండా చెప్పరాని ప్రదేశాల్లో లాఠీలతో కొట్టడం బాధాకరమన్నారు. కూటమి నాయకులు ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో చేసిన 16 రోజుల సమ్మె సంబంధించి ఒప్పంద జీవోలను అమలు చేయకుండా జాప్యం చేయడం విడ్డూరమన్నారు. 60 ఏళ్ల రిటైర్‌మెంట్ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా కార్మికులను తొలగిస్తూ సంక్షేమ పథకాలకు దూరం చేస్తున్నారన్నారు. అనారోగ్యంతో చనిపోయిన కార్మికుల కుటుంబాల్లో ఒక్కరికి కూడా ఉపాధి ఇవ్వడం లేదన్నారు. 12వ పిఆర్‌సిని అమలు చేయాలని, బకాయి ఉన్న ఐదు డిఎలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని నెల్లూరులో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులపై మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ పోలీసు యంత్రాంగాన్ని దింపి లాఠీఛార్జి చేయించడం దుర్మార్గమన్నారు. మున్సిపల్ కార్మిక సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా మరోసారి ఆందోళనలకు శ్రీకారం చుడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి శివప్రసాద్, రెగ్యులర్ ఉద్యోగుల కార్యదర్శి ఎల్.ముత్తురాజు, కోశాధికారి లక్ష్మీనరసమ్మ, ఉపాధ్యక్షులు రాఘవ, సహాయ కార్యదర్శులు బండారి స్వామి, శశీంద్రకుమార్, కమల్, పెన్నా నల్లప్ప, బాబు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులపై పోలీసులు జులుం ప్రదర్శించడాన్ని నిరసిస్తూ శుక్రవారం రాయదుర్గం పురపాలక సంఘంలో విధులు నిర్వహిస్తున్న రెగ్యులర్, ఇంజినీరింగ్, పారిశుధ్య విభాగం కార్మికులు స్థానిక వినాయక సర్కిల్‌లో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్ల యూనియన్ ఆఫీస్ బేరర్ తిప్పేస్వామి, మల్లేసి, అధ్యక్షులు నాగరాజు, కార్యదర్శి రాము, కోశాధికారి తిప్పేరుద్ర, కమిటీ సభ్యులు ఆదిలక్ష్మి, వన్నూరమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులపై పోలీసులు జులుం ప్రదర్శించడాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిరంకుశత్వంగా కార్మికులపై లాఠీఛార్జి చేయించడం మంచిది కాదన్నారు. నిరసనలో సిఐటియు నాయకులు ఓబులేసు, వన్నూరుస్వామి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం టౌన్ : నెల్లూరు మున్సిపల్ కార్మికులపై పోలీసులు జులుం ప్రదర్శించడాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అధ్యక్షులు నటరాజ్, కార్యదర్శి వన్నూరుస్వామి, కోశాధికారి దుర్గమ్మ, తదితరులు పాల్గొన్నారు.



గుత్తిలో నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

గుత్తి : నెల్లూరు కార్పొరేషన్ సంస్థలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న కార్మికులపై పోలీసులు లాఠీఛార్జి చేసినందుకు నిరసనగా శుక్రవారం సిఐటియు అనుబంధ సంస్థ ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సి.రమేష్, పారిశుధ్య కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.సూర్యనారాయణ, ఎన్.రామాంజనేయులు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎం.మల్లేష్, పారిశుధ్య కార్మిక సంఘం ఉపాధ్యక్షులు కె.మహేష్ సహాయ కార్యదర్శి టి.సుంకన్న, కోశాధికారి కె.బాలరంగన్న, నాయకులు ఈశ్వరయ్య, హరి, రత్నాలు, పెద్దక్క, భాగ్యమ్మ, కర్రెమ్మ, మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్షులు ఎస్.రాజా, కార్యదర్శి రవి, ఉపాధ్యక్షులు మురళి, రాజ్‌కుమార్, సహాయ కార్యదర్శులు ఆది, నరసింహులు, కోశాధికారి నక్కా శేఖర్, నాయకులు సాదిక్, బాబా, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి నవీన్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

జూదరుల అరెస్టు

శెట్టూరు : మండలంలోని ములకనూరు గ్రామ సమీపంలో కోడిపందేలు ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు సిఐ నీలకంఠేశ్వర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పక్కాగా అందిన సమాచారంతో సిబ్బందితో వెళ్లి దాడిచేసి ఇద్దరిని అదుపులోకి తీసుకోవడంతోపాటు ఒక ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లు, రూ.35,150 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి : మండలంలోని ఊటకల్లు గ్రామానికి చెందిన వ్యక్తి శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వెంకటార్జున గత కొన్నిరోజులుగా అనారోగ్య సమస్యలతో పాటుగా కుటుంబ సమస్యలతో బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో పలు ఆసుపత్రులలో చికిత్స చేయించుకున్నా వ్యాధి నయం కాలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

టిడిపి కార్యకర్తల మృతికి నివాళి

ప్రజాశక్తి-పామిడి

వేర్వేరు కారణాలతో మృతిచెందిన టిడిపి కార్యకర్తలకు టిడిపి మండల ఇన్‌ఛార్జి గుమ్మనూర్ ఈశ్వర్ శుక్రవారం నివాళులర్పించారు. మండలంలోని ఎద్దుల పల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు ప్రతాప్‌రెడ్డి తల్లి, చిన్న కుమారుడు లోకేష్‌రెడ్డి ప్రమాద వశాత్తు గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఈశ్వర్ పామిడి ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి వెళ్లి ఇద్దరికీ శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం స్థానిక నారాయణస్వామి వీధికి చెందిన బోయ లింగన్న కుమారుడు బోయ మసూద్ ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఈశ్వర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో టిడిపి నాయకులు కత్రిమల ప్రభాకర్‌చౌదరి, బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, జింకల సంజీవకుమార్, కొట్టం మాలిక్, నిమ్మకాయల సీనా, అనుంపల్లి శీన, బొమ్మా మోహన్ పాల్గొన్నారు.